ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

తమిళనాడు

TAMILNADU

గురువారం 12 డిసెంబరు 2024



రాజ్‌భవన్‌లో భారతీయార్ విగ్రహం ఉన్న పల్లకీ మోస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

మహాకవి భారతీయార్‌కు ఘన నివాళి

ప్యారీస్, డిసెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): తమిళమహాకవి భారతీయార్ 143వ జయంతిని బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన జన్మించిన తూత్తుకుడి జిల్లా ఎట్టాయపురంలోని మణిమండపంలో రాష్ట్ర ప్రభుత్వం తరుపున వేడుకలు నిర్వహించారు. అలాగే మెరీనా బీచ్ రోడ్డులో ఉన్న భారతీయార్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఆ మహనీయుని చిత్రపటానికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రహ్మణ్యం, దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, గ్రేటర్ చెన్నై మేయర్ ప్రియ, డిప్యూటి మేయర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యేలు, సమాచార, ప్రచార శాఖా ఉన్నత అధికారులు నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు తమిళిసై, టీఎంసీ ప్రధాన కార్యదర్శి జీఆర్ వెంకటేష్, తదితర నేతలు నివాళులర్పించారు. గిండీలోని రాజ్‌భవన్ ప్రాంగణంలో ఉన్న భారతీయార్ విగ్రహానికి గవర్నర్ ఆర్ఎన్ రవి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం భారతీయార్ విగ్రహం ఉన్న పల్లకీని పలువురు ప్రముఖులతో కలిసి మోస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామిక వేత్తలు నల్లి కుప్పుస్వామి చెట్టి, బీజీ సంతోషం, అధికారులు, తదితరులు పాల్గొన్నారు. భారతీయార్ జన్మస్థలమైన ఎట్టాయపురంలో ఆయన పేరుతో ప్రభుత్వం నిర్మించిన మణిమండపంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో తూత్తుకుడి జిల్లా కలెక్టర్ ఇళంభగవత్ నివాళులర్పించారు. తర్వాత భారతీయార్ జీవిత విశేషాలతో అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన ప్రారంభించి, ప్రజలతో కలిసి తిలకించారు.



భారతీయార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రులు

బలపడిన అల్పపీడనం 5 రోజులు వానలు



మైలాపూరు రాధాకృష్ణన్ రోడ్డులో వర్షంలో హెడ్‌లైట్లు వేసుకుని వెళ్తున్న వాహనాలు

చెన్నై, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతం ఏర్పడిన అల్పపీడనం వాయుగుండం మారనుండటంతో రాష్ట్రంలో బుధవారం ఉదయం నుండే చెదురుమదురుగా వర్షాలు కురుస్తున్నాయి. బలపడిన అల్పపీడనం తీరం వైపు కదులుతుండటంతో రానున్న ఐదు రోజులు రాష్ట్రంలో పలు చోట్ల భారీగా, ఓ మోస్తరుగా వర్షాలు కురువనున్నాయి. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మంగళవారం అల్పపీడనంగా మారింది. నైరుతి బంగాళాఖాతంలో ప్రవేశించి పశ్చిమ వాయవ్య దిశగా పయనించి బుధవారం శ్రీలంక, రాష్ట్రంలోని సముద్రతీరాల తీరాల వైపు కదులుతోందని, దీని ప్రభావంతో చెన్నైతోపాటు కడలూరు, మైలాడుదురై, నాగపట్టినం, తంజావూరు, తిరువారూరు, పుదుకోట జిల్లాల్లో పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయి. గురువారం శివగంగ, రామనాథపురం, శివగంగ, రామనాథపురం, తిరుచ్చి, పెరంబలూరు, అరియలూరు, కళ్ళకురిచ్చి, విల్లుపురం, చెంగల్పట్టు, కాంచీపురం, చెన్నై, తిరువళ్లూరు జిల్లాల్లో ఓ మోస్తరుగా వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.



రాయపేట వద్ద గొడుగు వేసుకుని వెళ్తున్న దృశ్యం

6 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్...

బంగాళాఖాతంలో బలపడిన అల్పపీడనం కారణంగా ఆరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. కడలూరు, మైలాడుదురై, నాగపట్టినం, తంజావూరు, తిరువారూరు, పుదుకోట జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఆ ఆరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. గురువారం డెల్టా జిల్లాల్లోనూ పలు చోట్ల ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయన్నారు.

రాజధాని నగరంలో వర్షం...

అల్పపీడనం తీరం వైపు కదులుతుండటంతో నగరంలో పలు చోట్ల బుధవారం ఉదయం చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. రాయపేట, ట్రిప్లికేన్, మనలి, తిరువొత్తియూరు, తండయార్‌పేట, రాయపురం, మైలాపూరు, అడయారు, మందవెళ్ళి, ఆళ్వార్‌పేట, తాంబరం, కోయంబేడు, మధురవాయల్, పూందమల్లి, అన్నానగర్, పెరంబూరు, కొళత్తూరు తదితర ప్రాంతాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. గురువారం నగరంలో ఆకాశం మేఘావృతమై ఉంటుందని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు మెరుపులతో వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. సముద్రతీర ప్రాంతాల్లో గురువారం గంటకు 45 కి.మీ.ల నుండి 55 కి.మీల వేగంతో పెనుగాలులు వీస్తాయని, అలల తాకిడి కూడా అధికంగా ఉంటుందని వివరించారు.

● కేరళ వెళ్లిన స్టాలిన్ ...

నేడు కేరళ సీఎం సమక్షంలో పెరియార్ స్మారక మండపానికి శ్రీకారం

చెన్నై, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రం కొట్టాయం వద్ద రూ.8.5 కోట్లతో పునర్నిర్మించిన పెరియార్ స్మారక మండప ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ బుధవారం బయలుదేరి వెళ్ళారు. గురువారం ఉదయం పది గంటలకు కేరళ ముఖ్యమంత్రి పినరాయ్ విజయన్ అధ్యక్షతన కొట్టాయం సమీపంలోని వైకం వద్ద ఆ స్మారక మండపాన్ని ప్రారంభించనున్నారు. వైకం ప్రాంతంలో ఆలయ ప్రవేశోద్యమం జరిగి వందేళ్లు పూర్తయ్యింది. ఆ ఉద్యమంలో ద్రవిడ ఉద్యమనేత పెరియార్ పాల్గొన్నారు. దానికి గుర్తుగా వైకం వద్ద 1994లో పెరియార్ స్మారక మండపాన్ని నిర్మించారు. ఆ మండపం గత కొన్నేళ్లుగా దుస్థితికి చేరటంతో రాష్ట్ర ప్రభుత్వం రూ. 8.5 కోట్లతో పునర్నిర్మించింది. కొత్త హంగులు సంతరించుకున్న ఆ స్మారక మండపాన్ని స్టాలిన్ ప్రారంభించి ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించే కేరళ ముఖ్యమంత్రి పినరాయ్ విజయన్ కూడా ప్రసంగిస్తారు. ఈ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు దురై మురుగన్, ఈవీ వేలు, ఎంపీ సామినాథన్, ప్రభుత్వ ప్రతినిధి ఎస్.మురుగానందం తదితరులు పాల్గొంటారు. కేరళ రాష్ట్రం తరఫున ఆ రాష్ట్ర మంత్రులు వీఎస్ వాసవన్, సజీ చెరియన్ కొట్టాయం ఎంపీ కె.ఫ్రాన్సిస్ జార్జి, వైకం శాసనసభ్యులు సీకే ఆషా, కేరళ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శారదా మురళీధరన్, కోట్టయమ్ జిల్లా కలెక్టర్ జాన్ వి.సామువేల్, వైకం పురపాలక సంఘం అధ్యక్షులు ప్రీతా రాజేష్, కౌన్సిలర్ రాజశేఖర్ తదితరులు పాల్గొంటారు.




కొట్టాయం చేరుకున్న సీఎం స్టాలిన్‌కు స్వాగతం పలుకుతున్న స్థానికులు, వివిధ కార్మిక సంఘాల సభ్యులు

● కార్తీక దీపోత్సవం...

కొండపైకి భక్తులకు అనుమతి లేదు

● మంత్రి శేఖర్ బాబు

అడయార్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీక దీపోత్సవం రోజున తిరువణ్ణామలై కొండపైకి భక్తులకు అనుమతి లేదని దేవాదాయ శాఖామంత్రి పీకే శేఖర్ బాబు తెలిపారు. అయితే, కొండపైకి 11,600 మంది భక్తులను అనుమతించనున్నారంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. మహాజ్యోతి దీపారాధన కోసం కేవలం ఆలయ సిబ్బంది, పోలీసులు, ఆలయ అధికారులను మాత్రమే అనుమతిస్తామని, జ్యోతిని వెలిగించేందుకు వెళ్ళే వారి వివరాలను అధికారులు తీసుకున్నారని తెలిపారు. తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి వేడుకల్లో భాగంగా, మంగళవారం మహారథోత్సవం జరిగింది. శుక్రవారం మహాదీపారాధన జరుగనుంది. సాధారణంగా ఈ జ్యోతి ప్రజ్వలన సమయంలో ఆలయ అధికారులతో పాటు పరిమిత సంఖ్యలో భక్తులను కొండపైకి అనుమతిస్తుంటారు. కానీ, ఇటీవల ఫెంగల్ తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాల కారణంగా తిరువణ్ణామలై కొండ చరియలు విరిగిపడి ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. దీంతో నిపుణుల బృందం కొండపైకి వెళ్ళి, జ్యోతి ప్రజ్వలన చేసే ప్రాంతాన్ని తనిఖీ చేసి నివేదికను సమర్పించింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండ బాగా తడిసివుందని, అందువల్ల కొండపైకి భక్తులను అనుమతించవద్దని సూచన చేసింది. ఈ కారణంగా కార్తీకపౌర్ణమి మహాదీపం రోజున భక్తులను కొండపైకి అనుమతించరాదని ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే విషయంపై రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి శేఖర్‌బాబు మాట్లాడుతూ, కార్తీక దీపోత్సవాలను పురస్కరించుకుని, తిరువణ్ణామలై కొండ శిఖరాగ్రంలో మహాజ్యోతి ప్రజ్వనలో ఎలాంటి ఆటంకాలు ఉండవన్నారు. భూగర్భగనుల శాఖ డైరెక్టర్ శరవణవేల్ రాజ్ ఆదేశం మేరకు ప్రొఫెసర్ ప్రేమలత సారథ్యంలో ఎనిమిది నిపుణులతో కూడిన బృందం మూడు రోజుల పాటు కొండను అధ్యయనం చేసిందన్నారు. ఆ నిపుణుల నివేదిక మేరకు 350 కిలోల బరువుతో కూడిన కొప్పరై, జ్యోతి ప్రజ్వలన కోసం ఉపయోగించే గాడగుడ్డ, 40 టిన్నుల్లో 600 కిలోల నెయ్యి ఆలయ సిబ్బంది, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది తీసుకెళ్తారని తెలిపారు. భరణి దీపం రోజున ఆలయంలోకి 500 మంది భక్తుల సహా అధికారులు, ఆలయ సిబ్బంది కలిపి 11600 మందికి అనుమతిస్తామని తెలిపారు. ఈ కార్తీక దీపోత్సవాలను విజయవంతం చేసేందుకు వీలుగా అన్ని రకాలైన చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.



బైక్ టాక్సీల వేగానికి కళ్లెం

● నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

● రవాణా శాఖ అధికారుల హెచ్చరిక



చెన్నై, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అడ్డూ అదుపూ లేకుండా విచ్చలవిడిగా తిరుగుతున్న బైక్ టాక్సీలను అదుపు చేయడానికి రాష్ట్ర రవాణా శాఖ సిద్ధమైంది. ఇందులో భాగంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘించే బైక్ టాక్సీలను స్వాధీనం చేసుకోవడంతో పాటు వాటిని నడిపేవారికి కూడా జరిమానా విధిస్తామని రవాణాశాఖాధికారులు హెచ్చరించారు. రాజధాని నగరం చెన్నై సహా పలు నగరాల్లో ఆటోలు, టాక్సీల్లో ప్రయాణించినవారంతా ప్రస్తుతం తక్కువ ఛార్జీతో బైక్‌ట్యాక్సీలపై వెళ్లటం ఆనవాయితీగా మారింది. దీంతో యేళ్లతరబడి ఆటోలను నడుపుతున్న కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో బైక్ టాక్సీలు ప్రయాణికులను తీసుకెళ్లటానికి బదులుగా వాణిజ్యపరమైన కార్యకలాపాలకు కూడా వినియోగిస్తున్నారు. ఓ వైపు నిరుద్యోగ యువకులు, విద్యార్థులు ఈ బైక్ టాక్సీలు నడపటం ద్వారా జీవితంలో నిలదొక్కుకుంటున్నారు. అయితే ఇటీవలి కాలంలో ఈ బైక్‌టాక్సీలు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం లేదని, ఆటో స్టాండ్లలో సంచరిస్తూ ప్రయాణికులను తక్కువ ఛార్జీతో తమ బైకు ఎక్కమని ఒత్తిడి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గత రెండు రోజులు ఆటో కార్మిక సంఘాల నాయకులంతా ప్రాంతీయ రవాణా అధికారులకు బైక్ టాక్సీలపై ఫిర్యాదు చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని కుర్రాళ్లంతా బైకులను రేస్ బైకుల్లా అత్యంత వేగంగా నడుపుతున్నారని, ఆటోలను ఆశ్రయించే ప్రయాణికులను మాయమాటలు చెప్పి బైకుల్లో తరలించుకపోయి తమ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆరోపించారు. ఆటో కార్మిక సంఘాల విజ్ఞప్తిని పరిశీలించిన ప్రాంతీయ రవాణా అధికారులు బైక్ టాక్సీల వేగానికి కళ్లెం వేయాలని నిర్ణయించారు. ఇకపై రోజూ నగరంలో తిరిగే బైక్ టాక్సీలపై పోలీసులు నిఘా వేయాలని, మోటారు సైకిళ్ల, స్కూటీలు కండిషన్‌గా ఉన్నాయో లేదో తనిఖీ చేయాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను బైక్ టాక్సీలు తప్పక పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ నిబంధనలు బుధవారం నుండే అమలులోకి వస్తాయన్నారు. ఆహార వస్తువులను తీసుకెళ్లే బైకులను తనిఖీ చేయకూడదని, అదే సమయంలో ఆ బైకుల్లో పరిమితికి మించిన బరువుతో సరకులు తీసుకెళ్తే వాహనాన్ని సీజ్ చేయాలని పేర్కొన్నారు. ఈ విషయమై రవాణా శాఖ మంత్రి శివశంకర్ మాట్లాడుతూ... బైక్ టాక్సీలకు కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చిందని, అయితే రాష్ట్రంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా వాటిని నడుపుతుండటం వల్లే ప్రాంతీయ రవాణాధికారులు చర్యలు చేపట్టనున్నారని తెలిపారు. ఇటీవల కాలంలో ఇన్సూరెన్స్ ఆర్సీ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా బైక్ టాక్సీ నడుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ కారణాల వల్లే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే బైక్ టాక్సీలపై కఠిన చర్యలు తీసుకోనున్నామని ఆయన చెప్పారు.

రాజకీయ పార్టీల తీరుకు

మమ్మల్ని బలిచేస్తారా...?

● మదురైలో రెవెన్యూ ఉద్యోగుల మహా ధర్నా



కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

పెరంబూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మదురై సమీపంలో వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్ పార్టీ జెండా ఎగురవేసిన వ్యవహారంలో ముగ్గురు రెవెన్యూ ఉద్యోగులపై సస్పెన్షన్ వేటుపడింది. ఉద్యోగుల సస్పెన్షన్ రద్దు చేయాలని, రాజకీయ పార్టీల ఘర్షణలకు ఉద్యోగులను సస్పెండ్ చేసిన జిల్లా యంత్రాంగం తీరును నిరసిస్తూ కలెక్టరేట్ ప్రాంగణంలో తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేసిన సుమారు వెయ్యి మంది ఉద్యోగులు ఆందోళనకు దిగారు. మదురై పుదూర్ వద్ద సెప్టెంబరులో వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్ 62 అడుగుల ఎత్తు కొయ్యపై పార్టీ జెండా ఆవిష్కరించారు. అనుమతి లేకుండా పెట్టారంటూ కలెక్టర్ ఆదేశంతో పోలీసులు రాత్రికి రాత్రే దానికి తొలగించారు. పోలీసుల చర్యను నిరసిస్తూ మదురై-అళగర్ ఆలయ రోడ్డుపై వీసీకే కార్యకర్తలు రాస్తారోకో చేశారు. మరుసటిరోజు మళ్లీ తిరుమావళవన్ పార్టీ జెండా ఆవిష్కరణ ఏర్పాట్లు చేపట్టడంతో, జెండా స్తంభం ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం అనుమతులిచ్చింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తిరుమావళవన్, మదురై జిల్లా కలెక్టర్‌గా సంగీత బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి వీసీకే పార్టీకి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో, మదురై వెలిసత్తం గ్రామంలో ఈ నెల 8వ తేది 45 అడుగుల ఎత్తున్న జెండా స్తంభం ఆవిష్కరణకు వీసీకే ఏర్పాటుచేపట్టింది. అనుమతి లేకుండా స్తంభం ఏర్పాటు చేస్తున్నారని తెలిపిన రెవెన్యూ అధికారులు, పోలీసులు నిరాకరించడంతో, ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ వ్యవహారంలో వెళ్లిసత్తం వీఏఓ పరమశివంను జిల్లా యంత్రాంగం సస్పెండ్ చేసింది. అదే సమయంలో సెప్టెంబరులో నిర్వహించిన జెండా స్తంభం వ్యవహారంలో ఇదివరకే ఇద్దరు వీఏఓలపై సస్పెన్షన్ వేటుపడింది. ఈ నేపథ్యంలో, కలెక్టర్ కార్యాలయం, ఎన్నికల కార్యాలయం సహా పలు కార్యాలయాల్లో పనిచేస్తున్న సుమారు వెయ్యి మందికి పైగా రెవెన్యూ ఉద్యోగులు కలెక్టరేట్ ప్రాంగణంలో ఆందోళనకు దిగారు.. అలాగే, జిల్లాలోని పలు ప్రాంతాల్లో రెవెన్యూ ఉద్యోగులు ఆందోళనలు చేపట్టారు. రాజకీయ పార్టీ ఘర్షణలకు ఉద్యోగులు బలవ్వడం ఎంతవరకు సబబని ప్రశ్నించిన నేతలు, సస్పెన్షన్లు సత్వరం రద్దు చేయాలంటూ నినాదాలు చేశారు.

సమాచార దృష్టి

హైకోర్టులో టెక్నికల్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మద్రాసు హైకోర్టులో 'పీసీ హోస్ట్ (టెక్నికల్)' విభాగంలో 75 పోస్టులు భర్తీచేయనున్నారు. అభ్యర్థులు కంప్యూటర్ సైన్స్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, ఏఐ, మిషన్ లెర్నింగ్ తదితర యూజీ కోర్సులు, బీఈ, బీటెక్ పూర్తిచేసి 35 ఏళ్లలోపుండాలి. నెలకు రూ.30,000 వేతనం అందజేయనున్నారు. రూ.600 రుసుముతో https://www.mhc.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 23వ తేదిలోపు దరఖాస్తుతో పాటు ఇతర సర్టిఫికెట్లు సమర్పించాలి. రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఈ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు.

ఆరోగ్య శాఖలో ఉద్యోగావకాశాలు

పెరంబూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా ఆరోగ్యశాఖలో పలు పోస్టులను కాంటాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్ విడుదల చేసిన ప్రకటనలో... మెడికల్ ఆఫీసర్, డిస్ట్రిక్ట్ క్వాలిటీ అడ్వయిజర్, ఆడియాలజిస్ట్, రేడియోగ్రాఫర్, సైకాలజిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్ తదితర పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న వారు https:// tiruvallur.nic.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకొని, సర్టిఫికెట్లతో ఈ నెల 23వ తేదిలోగా తిరువళ్లూర్‌లోని జిల్లా ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో స్వయంగాను, పోస్టు ద్వారా పంపించాలని కలెక్టర్ తెలిపారు.

జనవరి 13న రామనాథపురం జిల్లాకు సెలవు

వాషర్‌మెన్‌పేట,డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లాకు 2025 జనవరి 13న సెలవు ప్రకటించారు. తిరుఉత్తిరకోసమంగై ఆలయ ఆరుద్ర దర్శనం సందర్భంగా జిల్లాకు సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీచేసిన జిల్లా కలెక్టర్, అందుకు బదులు జనవరి 25వ తేది పనిదినంగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆదిద్రావిడ, గిరిజనుల కమిషన్ ఉపాధ్యక్షుడు, నలుగురు సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం నియమించనుంది. ఈ పదవులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తి కలిగిన వారు 'కార్యదర్శి ఆదిద్రావిడ, గిరిజన సంక్షేమ శాఖ, సచివాలయం, చెన్నై-600009' అనే చిరునామాలో ఈ నెల 24వ తేదిలోగా దరఖాస్తు చేయాలని సచివాలయం ప్రకటనలో తెలిపింది.

14న రేషన్ గ్రీవెన్స్

పెరంబూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా రేషన్ కార్డు వినియోగదారులు తమ సమస్యలు తెలిపేలా ప్రతి నెలా రేషన్ గ్రీవెన్స్ నిర్వహిస్తుంటారు. ఆ ప్రకారం, ఈ నెలకు సంబంధించి చెన్నై పరిధిలోని 19 మండల కార్యాలయాల్లో శనివారం ఉదయం 10 గంటలకు శిబిరాలు నిర్వహిస్తున్నారు. రేషన్‌కార్డుల్లో పేర్ల మార్పులు, చేర్పులు, చిరునామా, సెల్‌ఫోన్ నెంబర్ల మార్పు, రేషన్ దుకాణాల పనితీరు, సరకులు నాణ్యత, రేషన్ సిబ్బంది ప్రవర్తన తదితరాలపై ప్రజలు ఫిర్యాదు చేసి పరిష్కారం పొందవచ్చని పౌరసరఫరాలు, వినియోగదారుల భద్రత శాఖ ప్రకటన విడుదల చేసింది.

సౌదీలో వైద్యుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సౌదీ అరేబియా ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేసేందుకు వైద్యులు దరఖాస్తు చేసుకోవచ్చు. కన్సల్టెంట్, స్పెషలిస్ట్‌గా పనిచేసేందుకు 55 ఏళ్లు నిండని, 3ఏళ్ల అనుభవం కలిగిన పీజీ చేసిన వారు www.omcmanpower. tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు 6379179200 (వాట్సాప్ నెంబరు), 044-22505886, 22502267 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

'కబీర్' పురస్కారం రూ.5 లక్షలకు పెంపు

పెరంబూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మతసామర్యానికి కృషిచేసే వారిలో ఒకరికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా 'కోట్టై అమీర్ మత సామరస్య పతకం' అందజేస్తోంది. ఈ పురస్కారం కింద రూ.25 వేల నగదు, సర్టిఫికెట్ ఇస్తుంటారు. ఈ నేపథ్యంలో, పురస్కారంతో ఇచ్చే నగదు పెంచనున్నట్లు ఇటీవల సీఎం స్టాలిన్ ప్రకటించారు. ఆ ప్రకారం, రాబోయే 2025 నుంచి ఈ పురస్కార గ్రహీతకు రూ.5 లక్షలకు పెంచుతున్నట్లు ప్రభుత్వం జీవో విడుదల చేసింది.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తాంబరం విద్యుత్ మండల పరిధిలో గురువారం విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. వెస్ట్ తాంబరం ముల్లై నగర్‌లో ఉన్న పుదుతాంగళ్ ఉప విద్యుత్ కేంద్రం ప్రాంగణంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరుగనున్న ఈ గ్రీవెన్స్, తాంబరం మండల పరిధిలోని వినియోగదారులు పాల్గొని తమ సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.


జయ సమాధి అనుమతిలో అక్రమాలు

● కాగ్ ఆరోపణ

ప్యారీస్, డిసెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనా బీచ్ తీరంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత సమాధికి ఇచ్చిన అనుమతుల్లో పలు అక్రమాలు జరిగాయని కాగ్ తన నివేదికలో ఆరోపించింది. 2015 నుంచి 2021వ సంవత్సరం వరకు కోస్తా జిల్లాల్లో అనుమతించిన 175 పథకాల్లో 114 నిబంధనలను ఉల్లంఘించినట్లు కాగ్ పరిశీలనలో తెలిసింది. ఇందులో జయలలిత సమాధి కూడా ఉంది. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ నుంచి అనుమతి లేకుండా కోస్టల్ ప్రాంత నిర్వాహణ కార్యలయం నుంచి పొందిన అనుమతితో జయలలిత సమాధిని నిర్మించడాన్ని కాగ్ తప్పుబట్టింది.

సముద్రంలో పడవను ఢీకొన్న నౌక

● 9 మంది జాలర్లు సురక్షితం



వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా కుళచ్చల్ నడి సముద్రంలో సరుకు నౌక ఢీకొనడంతో దెబ్బతిన్న పడవ నీటమునిగిన నేపథ్యంలో, పడవలో 9 మంది జాలర్లను సహచర జాలర్లు రక్షించారు. కుళచ్చల్ ఫిషింగ్ హార్బర్ నుంచి ఐదు రోజుల క్రితం ఫైబర్ పడవలో 9 మంది జాలర్లు చేపల వేటకు వెళ్లారు. కుళచ్చల్ నుంచి 20 నాటికల్ మైళ్ల దూరంలో వారు చేపలు పడుతుండగా చమురు లోడుతో ఉన్న నౌక పడవను ఢీకొంది. దెబ్బతిన్న పడవ క్రమక్రమంగా నీళ్లలో మునగడం ప్రారంభమైంది. వీరిని గమనించిన సహచర జాలర్లు ఆ ప్రాంతానికి చేరుకొని, 9 మందిని సురక్షితంగా తమ పడవుల్లోకి చేర్చారు. కాగా, పడవ నీటమునుగుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరలయ్యింది.

'డయాలసిస్' సేవలకు నిపుణుల కమిటీ

పెరంబూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ రోగులకు అందించే డయాలసిస్ సేవలు మెరుగుపరిచేలా ప్రత్యేక నిపుణుల కమిటీని ప్రభుత్వం నియమించింది. కొంతకాలంగా డయాలసిస్ సేవలు పెరిగాయి. రాష్ట్రంలో నేషనల్ హెల్త్ కేర్ గ్రూప్ ఆధ్వర్యంలో మాత్రమే 139 డయాలసిస్ కేంద్రాలుండగా, ఈ చికిత్సలను ఉచితంగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. ఈ కేంద్రాల్లో సేవలు మెరుగుపరిచేందుకు దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం, ప్రత్యేక నిపుణుల కమిటీని నియమించింది. నేషనల్ హెల్త్ కేర్ గ్రూప్ డైరెక్టర్ నేతృత్వంలో, వైద్యం, గ్రామీణ సంక్షేమం, రాష్ట్ర అవయవ మార్పిడి కమిషనర్, స్వచ్ఛంద సంస్థలు, అధికారులు, వైద్యులు మొత్తం 19 మందితో నిపుణుల కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీ ప్రైవేటు, ప్రభుత్వాసుపత్రుల్లో డయాలసిస్ సేవలు పరిశీలించి, మరింత మెరుగైన చికిత్స అందించేందుకు తగిన సూచనలు, సలహాలు అందిస్తుందని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

పంబన్ తీరానికి బ్రీడెస్ తిమింగలం

ప్యారీస్, డిసెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): పాంబన్ తీరంలో 'ఫెంగల్' తుఫాన్ కారణంగా 20 అడుగుల పొడవైన బ్రీడెస్ తిమింగలం కళేబరం ఒడ్డుకు కొట్టుకొచ్చింది. అల్పపీడనం ప్రభావంతో రామనాథపురం జిల్లాకు ఆనుకుని సముద్ర ప్రాంతంలో 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తుండటంతో, తిమింగలం కళేబరం తీర ప్రాంతాలకు కొట్టుకువచ్చివుండవచ్చని మత్స్యకారులు తెలిపారు. ఈ విషయాన్ని అటవీశాఖా అధికారులకు తెలియజేయడంతో అధికారులు తిమింగలాన్ని అక్కడే ఖననం చేశారు.

వర్శిటీ సిండికేట్ మెంబర్‌గా నందకుమార్



వేలూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లువర్ యూనివర్శిటీ సిండికేట్ మెంబర్‌గా నందకుమార్ ఎన్నికయ్యారు. డీఎంకే జిల్లా అధ్యక్షుడు, ఆనైకట్టు ఎమ్మెల్యే నందకుమార్ గతంలోనూ రెండు సార్లు ఈ పదవిలో ఉండగా, మూడవ సారి కూడా ఆయన ఎంపికయ్యారు.

లబ్ధిదారులకు సంక్షేమ సహాయాల పంపిణీ



సహాయాలు అందజేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పేర్నాంబట్టు డివిజన్ పల్లాంకుప్ప గ్రామంలో బుధవారం గ్రీవెన్స్ జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో 128 మంది లబ్ధిదారులకు రూ.82.48 కోట్ల విలువైన సంక్షేమ సహాయాలను కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో గుడియాత్తం ఎమ్మెల్యే అమ్ములు విజయన్, పేర్నాంబట్టు యూనియన్ కమిటీ అధ్యక్షుడు చిత్ర జనార్దనన్, జిల్లా పంచాయతీల కమిటీ సభ్యుడు ఉత్తిరకుమార్, ఆదిద్రావిడుల సంక్షేమ అధికారి రామచంద్రన్, రెవెన్యూ తహసీల్దార్ సుబలక్ష్మి, పేర్నాంబట్టు తహసీల్దార్ గజేంద్రన్ సహా పలువురు అధికారులు, ప్రజలు, స్థానిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

బస్సు కింద పడి యువకుడి ఆత్మహత్య

ఐసిఎఫ్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కోవై రైల్వేస్టేషన్ జంక్షన్‌లో మంగళవారం సాయంత్రం బిహార్ రాష్ట్రానికి చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు... బిహార్ రాష్ట్రానికి చెందిన మితీష్‌కుమార్ (27) భవన నిర్మాణపనులకు వెళుతుంటాడు. మంగళవారం సాయంత్రం కోవై రైల్వేస్టేషన్ జంక్షన్ ఎదురుగా ఉన్న దుకాణంలో కూల్‌డ్రింక్స్ తాగి అదే మార్గంగా వస్తున్న ప్రభుత్వ బస్సు కింద ఒక్కసారిగా పడడంతో, అతనిని గమనించిన డ్రైవర్ సడన్ బ్రేక్ వేసి బస్సు నిలిపాడు. కానీ, అప్పటికే బస్సు వెనుక చక్రాల కింద పడిన మితీష్‌కుమార్ తీవ్రగాయాలపాలయ్యాడు. చుట్టుపక్కల వారు అతడిని వెంటనే సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

రూ.400 కోట్లతో డాబర్ ఆమ్లా కొత్త కర్మాగారం

పెరంబూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దిండివనం సిప్కాట్ ఫుడ్ పార్క్‌లో డాబర్ ఆమ్లా సంస్థ రూ.400 కోట్ల పెట్టుబడులతో కొత్త కర్మాగారం ప్రారంభించనుంది. అందుకోసం పర్యావరణ అనుమతులు కోరుతూ దరఖాస్తు చేసుకుంది.

నెల్లయప్పర్ ఆలయ ఏనుగు క్షేమం

● ఆలయ నిర్వాహకుల ప్రకటన



నెల్లయప్పర్ ఆలయ ఏనుగు కాంతిమది

టినగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి నగరం నడిబొడ్డున ఉన్న అరుళ్‌మిగు నెల్లయప్పర్ ఆలయ ఏనుగు కాంతిమది సంపూర్ణ ఆరోగ్యంతో ఉందని, ఆ ఏనుగు తీవ్ర అస్వస్థతకు గురైందని, దానిని రేకుల షెడ్డులో తాళ్లతో కట్టిపడేశారని సామాజిక ప్రసార మాధ్యమాల్లో వస్తున్న పుకార్లను నమ్మవద్దని ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. 1985 నుంచి ఈ ఆలయానికి చెందిన కాంతిమది అనే ఆడ ఏనుగును చక్కగా సంరక్షిస్తున్నామని, ఇటీవల వృద్ధాప్య సమస్యల కారణంగా ఆ ఏనుగు వెనుకవైపు కాళ్లు నడవడానికి సహకరించక ఇబ్బంది పడిందని, దీంతో వెటర్నరీ వైద్యులను రప్పించి చికిత్స అందిస్తున్నామని, వెనుకవైపు కాళ్ల వద్ద శస్త్రచికిత్స కోసం ఏనుగు రక్తాన్ని ప్రయోగశాలకు పంపామని, దాని ఫలితం రాగానే శస్త్రచికిత్స జరుగుతుందని, వెటర్నరీ డాక్టర్ల సలహా మేరకే కాళ్లకు బ్యాండేజీ కట్టినట్లు తెలిపారు. అంతేకాక ఆ ఏనుగు గజపూజలో పాల్గొనటం లేదనే పుకార్లను కూడా ఆలయ నిర్వాహకులు తీవ్రంగా ఖండించారు. వెనుకవైపు కాళ్లు బలహీనంగా ఉండటం వల్లే కాంతిమది పూర్తిగా విశ్రాంతి తీసుకునేందుకు భక్తులకు దూరంగా ఉంచామన్నారు. ఆలయంలో జరిగే గజపూజలో కాంతిమది తప్పకుండా పాల్గొంటుందని, ఆ ఏనుగు అనారోగ్యంగా ఉందంటూ భక్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కూడా వివరించారు.

తిరుప్పరంకుండ్రంపై కార్తీకదీపం వెలిగించే యత్నం

● హిందూమున్నని కార్యకర్తల అరెస్టు



ఊరేగింపులో పాల్గొన్న హిందూ మున్నాని కార్యకర్తలు

టినగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుప్పరంకుండ్రం కొండపై మంగళవారం రాత్రి కార్తీక దీపం వెలిగించడానికి ప్రయత్నించిన హిందూ మున్నాని నేతలు సహా 300 మంది కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి కొలువైన ఆ కొండపై దీపస్తంభం మీద దీపాన్ని వెలిగించాలని హిందూ మున్నని సహా పలు సంస్థలు గత కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తిరుప్పరంకుండ్రంపై కార్తీక దీపం వెలిగించేందుకు అనుమతించాలని డిమాండ్ చేస్తూ హిందూ మున్నాని ప్రధాన కార్యదర్శి కిషోర్, రాష్ట్ర విభాగం కార్యదర్శి ముత్తుకుమార్ నాయకత్వంలో సుమారు 300 మంది కార్యకర్తలతో భారీ ప్రదర్శన జరిపారు. ఈ ప్రదర్శనలో యువతీయువకులు మైలాట్టం, ఒయిలాట్టం వంటి జానపద నృత్యాలతో దేవతామూర్తుల వేషధారణతో, కావళ్లు మోస్తూ 16 కాళ్ల మండప ప్రాంగణం నుండి ఊరేగి, అదే ప్రాంతానికి తిరిగొచ్చారు. ఆ తర్వాత వీరంతా జ్యోతులు పట్టుకుని తిరుప్పరం కుండ్రంపై కార్తీక దీపాన్ని వెలిగించేందుకు బయలుదేరారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని అందరినీ అరెస్టు చేశారు.

ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య



అవంతిక, మోనిక (ఫైల్‌ఫొటో)

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ జిల్లాలో ఒకే గదిలో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విషాదానికి దారితీసింది. అవినాశి పళంకరై లక్ష్మీనగర్ ప్రాంతానికి చెందిన అవంతిక (19), గంగవర్ వీధికి చెందిన మోనికా (19) స్నేహితులు కాగా, ఇద్దరు తిరుమురుగన్‌పూండిలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతున్నారు. ఇరువురు కళాశాలకు కలిసి రావడం, ఇద్దరూ ఒకే గదిలో చదువుకోవడం చేస్తుంటారు. క్లాసులు అయిన తరువాత ఇద్దరు అదే ప్రాంతంలోని డిపార్ట్‌మెంటల్ స్టోర్‌లో పార్ట్‌టైం ఉద్యోగం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, మంగళవారం సాయంత్రం అవంతిక ఇంటికి మోనిక వెళ్లింది. చాలాసేపటి వరకు ఇంటి తలుపులు తెరచుకోకపోడంతో అనుమానించిన చుట్టుపక్కల వారు తలుపులు తెరచి చూడగా, ఇంట్లోని ఓ గదిలో అవంతిక, మోనిక వేర్వేరుగా ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడడం గమనించి దిగ్భ్రాంతి చెందారు. సమాచారం అందుకున్న అరంతాంగి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. కాగా, అవంతిక, మోనిక ప్రతి దగ్గరకు కలిసే వెళుతున్నారని, చదివే సమయంలో కూడా ఒక్కటిగా ఉండడంతో సక్రమంగా చదవలేకపోతున్నారని, అందువల్ల వేర్వేరుగా చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించినట్లు, దీంతో విడిపోతామని భావించిన ఇరువురు ఆత్మహత్యకు పాల్పడ్డారని పోలీసుల ప్రాథమిక విచారణలో తెలిసింది.

రవాణా సంస్థకు రూ.48 వేల కోట్ల నష్టం

● కాగ్ నివేదికలో వెల్లడి

ప్యారీస్, డిసెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ప్రభుత్వ నిర్వహణలోని రవాణా సంస్థ ప్రస్తుతం రూ.48 వేల కోట్ల నష్టంతో నడుస్తోందని కాగ్ నివేదికలో వెల్లడైంది. సిటీ బస్‌లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకం అవసరమా అనే అంశంపై కాగ్ ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తుంది. రాష్ట్రంలో 2017 నుంచి 2021 సంవత్సరం వరకు అధికారంలో ఉన్న అన్నాడీఎంకే హయాంలో ప్రభుత్వ రవాణా సంస్థలో నిర్వహించిన ఆడిటింగ్, 2021 నుంచి 2022వ సంవత్సరం వరకు ప్రస్తుత డీఎంకే ప్రభుత్వంలో చేపట్టిన ఆడిటింగ్ నివేదికను కాగ్ విడుదల చేసింది. అందులో వివరాలిలా ఉన్నాయి... 2017 నుంచి 2021 వరకు ప్రభుత్వ బస్‌ల ద్వారా వచ్చే ఆదాయంతో రవాణా శాఖలో ఖర్చులను పూర్తి చేసుకోలేని పరిస్థితి నెలకొనడంతో రవాణా సంస్థ వరుస నష్టాలతోనే పని చేసింది. రవాణా సంస్థ ఉద్యోగులను ఇతర శాఖలకు బదిలీ చేసినందున ప్రభుత్వ రవాణా సంస్థలకు రావల్సిన అదనపు ఆదాయం రూ.495.27 కోట్లకు గండిపడింది. ప్రభుత్వ రవాణా సంస్థలోనే కోయంబత్తూర్ మండలం రూ.4,819 కోట్ల నష్టాన్ని చూడగా, స్టేట్ ఎక్స్‌ప్రెస్ ట్రాన్స్‌పోర్ట్ కార్పోరేషన్ (ఎస్‌ఈటీసీ) మాత్రం ఖర్చులను ఆదా చేయడంపై దృష్టి సారించడంతో రూ.1,962 కోట్ల తక్కువ నష్టంలో ఉంది. ఉద్యోగుల కొరత కారణంగా దూరప్రాంతాలకు నడిపే బస్‌లో డ్రైవర్లే కండక్టర్ల బాధ్యతలను నిర్వహించడంతో ఈ సంస్థలో తక్కువ నష్టం వాటిల్లింది.

ప్రజారంగ సంస్థలు..

రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణలో పని చేసే 68 ప్రజారంగ సంస్థల్లో 32 సంస్థల్లో 2021 - 2022వ ఆర్థిక సంవత్సరంలో రూ.1,650 కోట్లలాభం ఆర్జించాయి. మూడు సంస్థలు లాభ, నష్టాలు లేకుండా పని చేయగా, 29 సంస్థలు మాత్రం రూ.22,153 కోట్ల నష్టాన్ని చవిచూసినట్లు కాగ్ నివేదికలో వెల్లడైంది. ప్రభుత్వ రవాణా సంస్థలు ఏ కారణాల వల్ల నష్టాల బాటలో పనిచేస్తున్నాయి, అందులో నుంచి గట్టెక్కాలంటే ఎలాంటి చర్యలు చేపట్టాలన్నా ప్రతిపాదనలను కూడా కాగ్ విడుదల చేసింది. సిటీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని డీఎంకే ప్రభుత్వం కల్పించింది. మరోవైపు బస్సుల్లో పాఠశాల, కళాశాలల విద్యార్థులు ఉచితంగా ప్రయాణం చేసేందుకు ప్రభుత్వం అనుమతించడం అవసరమేనా అని కాగ్ ప్రభుత్వానికి సలహా ఇవ్వడంతో పాటుగా ఉచిత ప్రయాణంపై ప్రజాభిప్రాయాలను కూడా సేకరించింది.

తిరువణ్ణామలైకు ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై కార్తీక బ్రహ్మోత్సవాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

● నెం.06159 కాట్పాడి-విల్లురం అన్ రిజర్వ్‌డ్ మెము స్పెషల్ ఈ నెల 13,14,15 తేదీల్లో కాట్పాడి నుంచి ఉదయం 6 గంటలకు బయల్దేరి 10 గంటలకు విల్లుపురం చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06160 విల్లుపురం-కాట్పాడి అన్ రిజర్వ్‌డ్ మెము స్పెషల్ ఈ నెల 13,14,15 తేదీల్లో విల్లుపురం నుంచి ఉదయం 11.15 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 3 గంటలకు కాట్పాడి చేరుకుంటుంది.

● నెం.06161 కాట్పాడి-విల్లుపురం అన్ రిజర్వ్‌డ్ మెము స్పెషల్ ఈ నెల 13,14,15 తేదీల్లో కాట్పాడి నుంచి మధ్యాహ్నం 2.30 గంటలకు బయల్దేరి సాయంత్రం 6.30 గంటలకు విల్లుపురం చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06162 విల్లుపురం-కాట్పాడి అన్ రిజర్వ్‌డ్ మెము స్పెషల్ ఈ నెల 13,14,15 తేదీల్లో విల్లుపురంలో రాత్రి 8 గంటలకు బయల్దేరి 11.45 గంటలకు కాట్పాడి చేరుకుంటుంది.

● నెం.06115 తాంబరం తిరువణ్ణామలై అన్ రిజర్వ్‌డ్ మెము స్పెషల్ ఈ నెల 13,14,15 తేదీల్లో తాంబరం నుంచి ఉదయం 10.45 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 2.45 గంటలకు తిరువణ్ణామలై చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06116 తిరువణ్ణామలై-తాంబరం అన్ రిజర్వ్‌డ్ మెము స్పెషల్ ఈ నెల 13,14,15 తేదీల్లో తిరువణ్ణామలైలో రాత్రి 10.25 గంటలకు బయల్దేరి మరుసటిరోజు వేకువజామున 2.15 గంటలకు తాంబరం చేరుకుంటుంది.

● నెం.06165 తిరువణ్ణామలై-విల్లుపురం అన్ రిజర్వ్‌డ్ మెము ఎక్స్‌ప్రెస్ స్పెషల్ ఈ నెల 13,14,15 తేదీల్లో తిరువణ్ణామలైలో మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరి సాయంత్రం 4.20 గంటలకు విల్లుపురం చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06166 విల్లుపురం-తిరువణ్ణామలై అన్ రిజర్వ్‌డ్ మెము ఎక్స్‌ప్రెస్ స్పెషల్ రైలు ఈ నెల 13,14,15 తేదీల్లో విల్లుపురంలో సాయంత్రం 4.40 గంటలకు బయల్దేరి 6 గంటలకు తిరువణ్ణామలై చేరుకుంటుంది. అలాగే, తిరువణ్ణామలై నుంచి 13,14,15 తేదీల్లో రాత్రి 6.30 గంటలకు బయల్దేరే రైలు రాత్రి 7.40 గంటలకు విల్లుపురం చేరుకొని, అక్కడి నుంచి రాత్రి 8 గంటలకు బయల్దేరి 9.30 గంటలకు తిరువణ్ణామలై చేరుకుంటుంది.

ట్రైనీ డాక్టర్ ఆత్మహత్యాయత్నం

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కోయిల్ ఆచారిపల్లం ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న ట్రైనీ డాక్టర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కళ్లకుర్చికి చెందిన చారుమతి (22) ఆచారిపల్లం ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ పూర్తిచేసి, అక్కడి ఆస్పత్రిలో ట్రైనీ డాక్టర్‌గా పనిచేస్తోంది. మంగళవారం ఆమె హాస్టల్ గదిలో హఠాత్తుగా స్పృహతప్పి పడిపోయింది. సహచార విద్యార్థులు ఆమెను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా, ఆమె విషం తీసుకున్నట్లు పరీక్షలో తేలింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, చారుమతి ఆత్మహత్యాయత్నానికి సంబంధించి ఆమె స్నేహితులను విచారించారు. కొద్దిరోజులుగా ఆమె ఎవరితో మాట్లాడకుండా ఒంటరిగా ఉండేదని వారు తెలుపడంతో, ఆమెను విచారించాలని పోలీసులు నిర్ణయించారు.

అలల్లో చిక్కుకొని ఇద్దరు చిన్నారుల మృతి

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లాలో సముద్రపు అలల్లో చిక్కుకొని ఇద్దరు చిన్నారులు మృతిచెందారు. ఈత్తామొళి సమీపం పుత్తన్‌తురై గ్రామంలోని బంధువుల ఇంట శుభకార్యక్రమంలో పాల్గొన్న ప్రితిషా (6), ఆమె తమ్ముడు ప్రణిత్ (5) సరదాగా సమీపంలోని సముద్ర తీరానికి వెళ్లారు. నీళ్లలో వారు ఆటలాడుకుంటున్న తరుణంలో హఠాత్తుగా వచ్చిన భారీ అలకు ఇద్దరూ లోపలికి వెళ్లిపోయారు. గమనించిన జాలర్లు వారిని రక్షించేందుకు ప్రయత్నించగా వీలుకాలేదు. కొద్దిసేపటికి ఇద్దరి మృతదేహాలు తీరానికి కొట్టుకొచ్చాయి. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

వ్యభిచారం చేస్తున్న మహిళ అరెస్ట్

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలో వ్యభిచారం చేస్తున్న మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. పెరంబూర్ జీకేఎం కాలని 11వ వీధిలోని ఓ ఇంట్లో వ్యభిచారం జరుగుతోందని వ్యభిచార నిరోధక విభాగానికి సమాచారం అందింది. దీంతో, మంగళవారం రాత్రి ఆ ఇంట్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన పోలీసులు, వ్యభిచారం జరుగుతుందని నిర్ధారించారు. ఈ వ్యవహారంలో అయనావరంకు చెందిన నసీమా (39)ను అరెస్ట్ చేసి, ఆ ఇంట్లో ఉన్న ఇద్దరు మహిళలను ప్రభుత్వ హోంకు తరలించారు.

ప్రైవేటు ఆస్పత్రిలో గర్భిణి మృతి

● ఆందోళనకు దిగిన బంధువులు

ప్యారీస్, డిసెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెన్నై సమీపంలోని తిరునిర్మలైకు చెందిన శరణ్య (35) గోపాలపురంలో కో ఆపరేటివ్ స్టోర్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తోంది. గర్భవతిగా ఉన్న ఆమెను ఇటీవల ఆమె భర్త మోహన్‌రాజ్ రెండో ప్రసవం కోసం తాంబరం, రాజకీలిపాకంలోని ఓ ప్రవేటు ఆస్పత్రిలో చేర్పించాడు. అయితే ఆమె బిడ్డకు జన్మనిచ్చి, ప్రసవ వేదనతో అక్కడే మృతి చెందింది. ఆస్పత్రిలో చేరిన శరణ్యకు అధిక రక్తస్రావం కావడంతో వైద్యులు చికిత్సచేయాలంటూ హడావిడి చేసి, ఎమర్జెన్సీలో ఉంచారు. ఎంత సమయమైనా శరణ్య ఆరోగ్యపరిస్థితి కోసం వైద్యులు చెప్పకపోవడంతో అనుమానం వచ్చిన శరణ్య భర్త, బంధువులు ప్రసవ గదికి వెళ్లిచూడగా తను అప్పటికే మృతిచెందినట్లు గుర్తించి, ఆస్పత్రి యాజమాన్యాన్ని ప్రశ్నించారు. వైద్యులు బదులివ్వకపోవడంతో భర్త, బంధువులు ఆస్పత్రి ఎదుట బైటాయించి నిరసనకు దిగారు. . విషయం తెలుసుకున్న సెలయ్యూర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బంధువులను శాంతింపజేసి, శరణ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం క్రోంపేటలోని ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో మిస్టరీ మరణాలు...!

పెరంబూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలో గత 15 రోజుల్లో ఇద్దరు యువతులు సహా నలుగురు హోటళ్లలో మృతిచెందడం మిస్టరీగా మారింది. గత నెల 26వ తేది వేళచ్చేరిలో ఉన్న ఓ లాడిలో 60 ఏళ్ల వ్యక్తితో బసచేసిన 27 ఏళ్ల యువతి హఠాత్తుగా గుండెపోటుకు గురై మృతిచెందింది. ఈ నెల 7వ తేది చూలైమేడులో స్నేహితుడితో కలసి మద్యం తాగిన బ్యూటీషియన్ హఠాత్తుగా స్పృహతప్పి మృతిచెందింది. ఇక, గత మంగళవారం హోటల్ మేనేజర్ సురేష్‌బాబు టి.నగర్‌లోని ఓ లాడ్జిలో నగ్నంగా ఉన్న స్థితిలో మృతిచెంది కనిపించాడు. అలాగే, గిండిలోని ప్రముఖ ప్రైవేటు చానల్‌లో కమర్షియల్ విభాగంలో సీనియర్ అధికారిగా పనిచేస్తున్న ఢిల్లీకి చెందిన రవిశంకర్, సైదాపేట చిన్నమలైలోని ఓ ప్రైవేటు హోటల్‌లో బస చేస్తూ మంగళవారం ఉదయం అచేతనంగా పడి ఉండడం గమనించిన సిబ్బంది, 108 అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. నగరంలో 15 రోజుల్లో నలుగురు మృతి చెందడం వెనుక మిస్టరీ పోలీసుల విచారణ తర్వాత తెలిసే అవకాశముంది.

గంజాయి మొక్కలు పెంచుతున్న వృద్ధుడి అరెస్ట్

పెరంబూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో గంజాయి మొక్కలు పెంచుతున్న వృద్ధుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈరోడ్ జిల్లా టీఎన్ పాళయం సమీపం కేఎన్ పాళయంలోని ఓ ఇంట్లో గంజాయి సాగుచేస్తున్నట్లు పంగలాపుదూర్ పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు ఆ ప్రాంతంలోని పూంకరుప్పన్ (70) ఇంట్లో తనిఖీ చేసి, ఇంటి వెనుక మూడు గంజాయి మొక్కలను గుర్తించారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన పోలీసులు పూంకరుప్పన్‌ను అరెస్ట్ చేశారు.

విమానంలో ఫ్యూయల్ లీకేజీ

● తృటిలో తప్పిన ప్రమాదం

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విమానంలో ఫ్యూయల్ లీకవడాన్ని గుర్తించిన పైలెట్ సత్వరం కంట్రోల్‌రూమ్‌కు తెలియజేయడంతో పెనుప్రమాదం తప్పింది. మీనంబాక్కం విమానాశ్రయం నుంచి సింగపూర్‌కు బుధవారం ఉదయం 11.55 గంటలకు 'ఎయిర్ ఇండియా' విమానం బయల్దేరేందుకు సిద్ధంగా ఉంది. ఈ విమానంలో 145 మంది ప్రయాణికులున్నారు. విమానం బయల్దేరే ముందుగా పైలెట్ చివరిగా పరిశీలించారు. ఆ సమయంలో విమానం నుంచి ఫ్యూయల్ లీకవడాన్ని గుర్తించిన పైలెట్, వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాడు. దీంతో, ఇంజనీరింగ్ నిపుణులు, విమానాశ్రయ అధికారులు సత్వరం అక్కడకు చేరుకొని విమానంలో ఏర్పడిన సాంకేతికలోపం సరిచేసే చర్యలు చేపట్టారు. విమానం నుంచి పెట్రోల్ లీకేజీ సరైన తరుణంలో పైలెట్ గుర్తించడంతో 145 మంది ప్రయాణికులు అదృష్టవశాత్తు బయట పడ్డారని అధికారులు తెలిపారు.

13 విమానాల రద్దు...

నగరానికి రావాల్సిన, బయల్దేరాల్సిన 13 విమానాలు రద్దయ్యాయి. బుధవారం తెల్లవారుజాము నుంచి నగరంలో భారీవర్షం కురుస్తోంది. ఈ పరిస్థితుల్లో వాతావరణం అనుకూలించకపోవడంతో నగరానికి రావాల్సిన ఏడు, నగరం నుంచి బయల్దేరాల్సిన 6 విమానాలు కలిపి మొత్తం 132 విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఇక, ఢిల్లీ నుంచి వచ్చిన విమానం మీనంబాక్కంలో ల్యాండ్ అయ్యేందుకు వాతావరణం అనుకూలించకపోవడంతో దానిని బెంగళూరుకు మళ్లించినట్లు అధికారులు తెలిపారు.

విద్యార్థిని ఆత్మహత్య

ఐసిఎఫ్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక మడిపాక్కంలో పాఠశాల విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విషాదం నింపింది. అయ్యప్పనగర్‌కు చెందిన రాధకు ఇద్దరు కుమార్తెలున్నారు. ప్రతిరోజు కూలి పనులకు వెళ్లే రాధతో కలిసి కుమార్తెలు పాఠశాలకు వెళ్తుంటారు. మంగళవారం ఉదయం యధావిధిగా రాధ పనులకు వెళ్లిపోయాడు. మధ్యాహ్నం ఆయన సెల్‌ఫోన్‌కు పాఠశాల యాజమాన్యం ఫోన్ చేసి మీ కుమార్తె నిరంజన పరీక్షకు హాజరుకాలేదని తెలిపారు. దీంతో ఆందోళన చెందిన రాధ హుటాహుటిన ఇంటికి వచ్చి చూడగా ఫ్యానుకు ఉరేసుకొని మృతిచెందిన కుమార్తె కనిపించడంతో బోరున విలపించాడు. ఈ ఘటనపై మడిపాక్కం పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

వ్యాన్ ఢీకొని...

స్థానిక అంబత్తూర్ పుత్తాగరానికి చెందిన అరుణ్‌కుమార్ (33) ఓ సినీ స్టూడియోలో పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం యధావిధిగా ఇంటి నుంచి ద్విచక్రవాహనంలో బయల్దేరి కొరట్టూరు వాటర్ కెనాల్ సమీపంలో వస్తున్న సమయంలో ఎదురుగా వచ్చిన వ్యాన్ ఢీకొనడంతో, తీవ్రగాయాలతో అరుణ్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో...

జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఉమేష్‌కుమార్ (24) భవన నిర్మాణ కార్మికుడుగా పనిచేస్తున్నాడు. కేకే నగర్ బొబ్బిలిరాజా నగర్‌లో నివసిస్తున్న ఉమేష్ కుమార్, మంగళవారం మద్యం సేవించి పనిచేస్తున్న సమయంలో మిద్దెపై నుంచి కిందపడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. సహచారులు అతడిని వెంటనే రాజీవ్ గాంధీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స ఫలించక బుధవారం ఉదయం మృతిచెందాడు. ఈ ఘటనపై కేకే నగర్ పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేపట్టారు.



'మిస్ యూ'లో సిద్ధార్థ్ - అషికా రంగనాథ్



'సూదు కవ్వుం-2'లో ఓ దృశ్యం

ఈ వారం విడుదలయ్యే చిత్రాలు ...

ఈ యేడాది మరికొన్ని రోజుల్లో ముగియనుంది. డిసెంబరు రెండో శుక్రవారమైన ఈ నెల 13వ తేదీ మొత్తం 9 చిత్రాలు విడుదల కావాల్సి ఉండగా, తుది రేసులో రెండు చిత్రాలు మాత్రమే మిగిలేలా ఉన్నాయి. వీటిలో ఒకటి సిద్ధార్థ్ హీరోగా నటించిన 'మిస్ యూ', రెండోది మిర్చి శివ నటించిన 'సూదు కవ్వుం-2' ఉన్నాయి. విడుదలకు సిద్ధమై వివిధ కారణాలతో విడుదలకు నోచుకోలేకపోతున్న చిత్రాల్లో '2కే లవ్ స్టోరీ', 'వన్స్ అపాన్ ఏ టైమ్ ఇన్ మద్రాస్', 'అందనాల్', 'మౌనమే కాదలాయ్', 'విడింజా ఎనక్కు కళ్యాణం', 'మళైయిల్ నినైగిరేన్', 'తెన్ చెన్నై' చిత్రాలున్నాయి. అయితే, చివరి నిమిషం ఏదేనా మార్పులు జరిగితే ఈ చిత్రాల్లో ఒకటి రెండు చిత్రాలు విడుదల కావొచ్చని కోలీవుడ్ వర్గాల సమాచారం. తమ చిత్రాలను విడుదల చేస్తున్నట్టు గొప్పగా ప్రకటించే మేకర్స్.. చివరి నిమిషంలో తగినన్ని థియేటర్లు లేవనో, ఇతర కారణాల వల్ల రిలీజ్ విషయంలో వెనుకంజ వేస్తున్నారు. ఇదిలావుంటే, ఈ యేడాదిలో మొత్తం 240 నుంచి 250 చిత్రాలు విడుదలయ్యే అవకాశం ఉన్నట్టు కోలీవుడ్ వర్గాలు పేర్కొన్నాయి. గత యేడాది కూడా 240 పైచిలుకు చిత్రాలు విడుదలైన విషయం తెల్సిందే.

మళ్ళీ లోకేష్ దర్శకత్వంలో కమల్ ?

చిత్రజ్యోతి

యంగ్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ మరోమారు అగ్రనటుడు కమల్ హాసన్‌ను డైరెక్ట్ చేయనున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'విక్రమ్' బ్లాక్‌బస్టర్‌గా నిలిచి, నిర్మాతగా కూడా కమల్‌కు కలెక్షన్ల వర్షం కురిపించింది. ప్రస్తుతం సూపర్‌స్టార్ రజనీకాంత్ చిత్రానికి లోకేష్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో సత్యరాజ్, అమీర్ ఖాన్, నాగార్జున, ఉపేంద్ర వంటి స్టార్ హీరోలు కీలక పాత్రు పోషిస్తున్నారు. ఈ నేపథ్యంలో 'కూలీ' సినిమా తర్వాత కార్తీ హీరో 'ఖైదీ-2'ను లోకేష్ కనకరాజ్ తెరకెక్కించనున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న లోకేష్ మాట్లాడుతూ, 'కమల్ హాసన్‌ను డైరెక్ట్ చేయడం గొప్ప అదృష్టం. మళ్ళీ మరోమారు ఆయనతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నాను' అని వెల్లడించారు. దీంతో వీరిద్దరి కాంబినేషన్‌లో 'విక్రమ్-2' వస్తుందని భావిస్తున్నారు.



లోకేష్ కనకరాజ్, కమల్ హాసన్

'క.. అజితే' అనొద్దు

● అభిమానులకు హీరో అజిత్ వినతి...



తన అభిమానులకు, సినీ ప్రేక్షకులకు అగ్రహీరో అజిత్ కుమార్ ఓ విజ్ఞప్తి చేశారు. తనను 'క... అజితే' (కడవుల్ అజితే) అంటూ సంబోధించవద్దని కోరారు. తన పేరుతో కాకుండా ఏ ఇతర ఉపసర్గలతో తనను పిలిస్తే ఏమాత్రం ఇష్టం ఉండదని, పైగా మనసు నొప్పిస్తుందన్నారు. ఇదే విషయంపై ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఇటీవలికాలంలో పలు కార్యక్రమాలు, బహింగ ప్రదేశాల్లో 'క... అజితే' అంటూ అభిమానులు నినాదాలు చేయడం ఎక్కువైంది. ఇది నన్ను తీవ్ర ఆందోళనకు గురిచేస్తుంది. నా పేరుతో పిలవడాన్ని మినహా ఏ ఇతర పేర్లతో పిలవడం ఏమాత్రం ఇష్టం ఉండదు. అందువల్ల పబ్లిక్ ఈవెంట్స్ సినిమా ఫంక్షన్లలో పూర్తి పేరుతో నినాదాలు చేయండి. ఈ విషయంలో ప్రతి ఒక్క అభిమాని సహకారాన్ని కోరుతున్నాను. 'క.. అజితే' వంటి నినాదాలకు ఇంతటితో ముగింపు పలుకుదాం. మీరు నా అభ్యర్థనకు సహకరిస్తారని ఆశిస్తున్నాను. ఎవరినీ నొప్పించకుండా కష్టపడి పనిచేయండి. మీ కుటుంబాన్ని జాగ్రత్తగా చూసుకోండి. చట్టాన్ని గౌరవించే బాధ్యతాయుత పౌరులుగా జీవించండి. మీకు, మీ కుటుంబానికి అందమైన జీవితం కావాలని కోరుకుంటున్నాను. జీవించండి... జీవించనివ్వండి' అంటూ అజిత్ కుమార్ మేనేజర్ సురేష్ చంద్ర విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

క్రీడాకారిణిగా చూడాలనుకున్నారు

● మీనాక్షి చౌదరి



తాను ఒక మంచి క్రీడాకారిణి కావాలన్నది తన తండ్రి కోరిక అని, కానీ తాను ఎవరూ ఊహించని విధంగా హీరోయిన్ అయ్యానని మీనాక్షి చౌదరి అన్నారు. టాలీవుడ్‌లో పలు హిట్ చిత్రాల్లో నటించిన ఆమె... తమిళంలో 'సింగపూర్ సలూన్', 'ది గోట్' వంటి చిత్రాల్లో నటించి కోలీవుడ్ ప్రేక్షకులకు దగ్గరయ్యారు. తాజాగా ఆమె ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. 'నా తండ్రి సైనికోద్యోగి కావడంతో కఠిన ఆంక్షల మధ్య పెరిగాను. పాఠశాల, కాలేజీ చదువుకునే రోజుల నుంచే నన్ను మంచి క్రీడాకారిణిగా చూడాలని మా నాన్న భావించారు. ఆ విధంగానే నన్ను క్రీడాకారిణిగా తీర్చిదిద్దారు. రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో కూడా పాల్గొన్నాను. చివరకు ఆయన కోరిక నెరవేర్చలేకపోయాను. ఒక మంచి క్రీడాకారిణి కావాలని డాడీ ఆశపడితే, నేను మాత్రం ఒక హీరోయిన్ అయ్యాను. నేను సినిమాల్లో కథానాయికగా నటిస్తానని కలలో కూడా ఊహించలేదు' అని పేర్కొన్నారు.

ఎఫ్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడిగా ఐసరి కె.గణేష్



ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎఫ్ఐ) ఉపాధ్యక్షుడిగా వేల్స్ గ్రూపు విద్యా సంస్థల అధినేత, సినీ నిర్మాత డాక్టర్ ఐసరి కె.గణేష్ ఎంపికయ్యారు. ఎఫ్ఎఫ్ఐలో దాదాపు 18 వేల మంది నిర్మాతలు, 20 వేల మంది డిస్ట్రిబ్యూటర్లు, 12 వేల మంది స్టూడియో అధినేతలు సభ్యులుగా ఉన్నారు. ముంబై ప్రధాన కార్యాలయంగా పనిచేస్తున్న ఎఫ్ఎఫ్ఐ భారతీయ చిత్రపరిశ్రమను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్ళే లక్ష్యంతో పనిచేస్తుంది. ఈ నేపథ్యంలో ఎఫ్ఎఫ్ఐ కార్యవర్గ సమావేశం తాజాగా గోవాలో జరిగింది. ఇందులో వేల్స్ ఫిలిమ్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ నిర్మాత, వేల్స్ యూనివర్శిటీ చాన్సలర్ ఐసరి కె.గణేష్ ఉపాధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఆయనను తమిళ చిత్రపరిశ్రమకు చెందిన పలువురు నిర్మాతలు, ప్రముఖులు, సినీ సెలబ్రిటీలు అభినందనలు తెలుపుతున్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 25 వినతులు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న పోలీస్ కమిషనర్ అరుణ్

పెరంబూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు తెలుసుకొనేలా ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ అరుణ్ బాధ్యతలు చేపట్టిన అనంతరం ప్రకటించారు. ఆ ప్రకారం ఎగ్మూర్‌లోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్ లో కమిషనర్ అరుణ్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. 25 వినతిపత్రాలు అందాయని, వాటిని విచారించి సత్వరం పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధికారులను ఆదేశించారని నగర పోలీసు శాఖ విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

టంగ్‌స్టన్ వేలాన్ని రద్దు చేయండి

● డీపీఐ నేత తిరుమావళవన్ డిమాండ్



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న తిరుమావళవన్

టి.నగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా మేలూరు సమీపం అరిట్టాపట్టి పరిసర గ్రామాల్లో టంగ్‌స్టన్ తవ్వకాల కోసం నిర్వహించిన వేలం పాటను రద్దు చేయాలని డీపీఐ నేత, ఎంపీ తొల్ తిరుమావళవన్ డిమాండ్ చేశారు. ఆమేరకు కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా కేంద్రం ప్రభుత్వం ఎలాంటి పథకాన్ని అమలు చేయదని స్పష్టం చేశారు. టంగ్‌స్టన్ తవ్వకాల ప్రాజెక్టుకు వ్యతిరేకంగా శాసనసభలో చేసిన ప్రత్యేక తీర్మానం వివరాలు తనకు అందాయని, వాటిని పరిశీలించానని చెప్పారు. కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డితో భేటీ సంతృప్తిని కలిగించిందని తిరుమావళవన్ తన ఎక్స్‌పేజీలో ఓ సందేశాన్ని కూడా వెలువరించారు.

మహాబలిపురంలో ఈసీ పర్యటన

ప్యారీస్, డిసెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): చెంగల్‌పట్టు జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రం మహాబలిపురంలో కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ పర్యటించారు. అక్కడున్న పల్లవరాజుల కాలం నాటి ప్రాచీన శిల్పకళా ఖండాలను, సముద్రతీర ఆలయాన్ని వీక్షించారు. మంగళవారం మహాబలిపురాన్ని సందర్శించడానికి వెళ్లిన ఈసీ జ్ఞానేష్‌కుమార్‌కు రాష్ట్ర ప్రభుత్వం తరుపున చెంగల్‌పట్టు జిల్లా సబ్ కలెక్టర్ నారాయణ శర్మ, పర్యాటక శాఖ అధికారి సత్యవేలు ఘన స్వాగతం పలికారు. పల్లవరాజులు బంగాళఖాతం తీరంలో నిర్మించిన ఆలయాన్ని, శివ, విష్ణు సన్నిధులను సందర్శించిన జ్ఞానేష్‌కుమార్‌కు ఆలయ చరిత్ర గురించి వివరించారు. చివరగా పురాతన శిల్పకళా ఖండాలు, రాతితో చెక్కిన ఐదు రథాల ముందు నిలబడి జ్ఞానేష్‌కుమార్ సెల్ఫీ తీసుకున్నారు. ఈసీ పర్యటన సందర్భంగా మహాబలిపురం ప్రాంతంలో పోలీసు శాఖా భద్రత ఏర్పాటు చేశారు.

అపోలో చిల్డ్రన్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో చిన్నారుల విహారయాత్ర

చెన్నై, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన అపోలో చిల్డ్రన్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రతిభావంతులైన బాలబాలికలను బుధవారం ఉదయం వండలూరు జంతు ప్రదర్శన శాలకు విహారయాత్ర తీసుకెళ్లారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సుప్రియా సాహూ ఈ విహారయాత్రలో విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. జంతుప్రదర్శనశాల డైరెక్టర్ ఆశిష్ కుమార్ శ్రీవత్సవ, అసిస్టెంట్ జూ డైరెక్టర్ మణికంఠ ప్రభు ప్రత్యేక ప్రతిభావంతులైన బాలబాలికలకు ఘనంగా స్వాగతం పలికారు. ఆ తర్వాత ఆ చిన్నారులు అక్కడి జంతువులను చూస్తూ సందడి చేశారు.



వండలూరు జూ సందర్శించిన ప్రత్యేక ప్రతిభావంతులైన చిన్నారులు

గజ వాహనంపై పంచమూర్తుల విహారం

వేలూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయ కార్తీక దీపోత్సవాల్లో భాగంగా 8వ రోజైన బుధవారం పంచమూర్తులు వివిధ రకాల వాహనాల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. అన్నామలైయార్, ఉన్నామలై అమ్మవారు ప్రత్యేక అలంకరణలో గజ వాహనంపై మాడవీధుల్లో విహరించారు. వారిని చండికేశ్వరుడు, వినాయకుడు, వల్లి, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామితో కూడిన వాహనాలు అనుసరించాయి. ఈ వేడుకల్లో వేలాది మంది భక్తులు పాల్గొని పంచమూర్తులను సేవించారు. కాగా, కార్తీక దీపోత్సవాల్లో దీపం వెలిగేందుకు నెయ్యి కొనుగోలుకు భక్తులు ఆలయ ప్రాంగణంలో ఉన్న కౌంటర్‌లో నగదు చెల్లిస్తున్నారు.



→ నగదు చెల్లిస్తున్న భక్తులు



అశ్వ వాహనంపై వినాయకుడు



అశ్వ వాహనంపై అన్నామలైయార్, ఉన్నామలై అమ్మవారు

ఆలోచనలు కాదు కార్యాచరణ ప్రధానం

● పట్టభద్రులకు సంజయ్ బేహారి పిలుపు



స్నాతకోత్సవంలో విద్యార్థినికి పట్టా ప్రదానం చేస్తున్న శ్రీరామచంద్రా విశ్వవిద్యాలయం ఛాన్సలర్ వీఆర్ వెంకటాచలం

చెన్నై, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాల నుంచి పట్టాలు, పతకాలు అందుకునే విద్యార్థులు జీవితంలో ఎదగటానికి మంచి ఆలోచనతో ఉంటే సరిపోదని వాటికి కార్యరూపం ఇవ్వాలని తిరువనంతపురం లోని చిత్ర తిరునాళ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్, జాతీయ వైద్య మండలిలోని వైద్య ప్రమాణ అంచనాల సంస్థ అధ్యక్షుడు డాక్టర్ సంజయ్ బేహారి పిలుపునిచ్చారు. పోరూరులోని శ్రీరామచంద్రా ఉన్నతవిద్యా పరిశోధనా సంస్థ (శ్రీహర్) 38వ స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై స్నాతకోత్సవ సందేశమిచ్చారు. ఇంద్రధనుస్సులోని రంగులు తీరుతెన్నులపై శాస్త్రవేత్తలు జరిపిన పరిశోధనల వల్లే ప్రపంచ చారిత్రక విషయాలు బయల్పడ్డాయన్నారు. విద్యార్థులు తమ భవిష్యత్తుకు సంబంధించి ఉపాయాలు తలెత్తితే వాటిని కార్యాచరణలో పెట్టి ఉన్నత స్థితికి చేరాలన్నారు. ఈ స్నాతకోత్సవానికి వ్యవస్థాపక ఛాన్సలర్ వీఆర్ వెంకటాచలం అధ్యక్షత వహించారు. వైస్‌ఛాన్సలర్ డాక్టర్ ఉమాశంకర్ వార్షిక నివేదిక సమర్పించారు. వివిధ విభాగాల్లో ప్రతిభాపాటవాలతో ఉత్తీర్ణులైన 74 మంది విద్యార్థులకు డాక్టర్ సంజయ్ బేహారి స్వర్ణపతకాలను అందించారు. మెడికల్ ఇంజనీరింగ్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన 1680 మందికి పట్టాలు ప్రదానం చేశారు. శ్రీహర్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ ఏకే అగర్వాల్, ప్రో వైస్‌ఛాన్సలర్ డాక్టర్ మహేష్ వాకముడి, మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ కే బాలాజీ సింగ్, డెంటల్ కాలేజీ డీన్ డాక్టర్ హెచ్ తమిళ్‌సెల్వన్ తదితరులు పాల్గొన్నారు.

వర్క్ ప్లేస్‌లో మహిళలకు మద్దతు కావాలి

● సైకాలజిస్ట్ డాక్టర్ శ్రీవిద్య

అడయార్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వర్క్‌ప్లేస్‌లో మహిళలను శక్తివంతం చేయడానికి వీలుగా ఈవోల్స్ ఒక ప్లాట్‌ఫామ్ ప్రారంభించింది. మహిళల సంపూర్ణ మానసిక క్షేమం కోసం ఈ తరహా వేదికను ప్రారంభించినట్టు ఈవోల్స్ వెల్లడించింది. ఈ ప్లాట్‌ఫాం ప్రాంభోత్సవానికి కాగ్నిజెంట్ మాజీ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, నాస్కామ్ మాజీ చైర్మన్ ఆర్.చంద్రశేఖరన్, వీఐటీ యూనివర్శిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ట్రస్టీ డాక్టర్ సంధ్య అధ్యక్షత వహించారు. ఈవోల్స్‌లోని చీఫ్ సైకాలజిస్ట్ డాక్టర్ శ్రీవిద్య మాట్లాడుతూ, వర్క్‌ప్లేస్‌లో మహిళలకు మద్దతునిచ్చే విధానంలో ప్రాథమిక మార్పు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవోల్స్ సీవోవో దిగ్విజయ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ప్రముఖులు

ఎక్స్‌ప్రెస్ మాల్‌లో వింటర్ క్రిస్మస్ ప్లేగ్రౌండ్



వేడుకల్లో నటి స్నేహ

అడయార్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయపేటలోని ఎక్స్‌ప్రెస్ మాల్‌లో దేశంలోనే తొలిసారి లిగో వింటర్ క్రిస్మస్ ప్లేగ్రౌండ్ ప్రారంభించారు. బుధవారం జరిగిన ప్రారంభ కార్యక్రమంలో సినీ నటి స్నేహ పాల్గొన్నారు. ఇది 5 నుంచి 14 యేళ్ళ చిన్నారులకు హాలిడే స్పాట్‌గా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఎక్స్‌ప్రెస్ అవెన్యూ దేశంలోనే తొలిసారి 22 అడుగుల క్రిస్మస్ ట్రీని లెగో బ్రిక్స్‌తో ఏర్పాటు చేయడం జరిగిందని ఎక్స్‌ప్రెస్ అవెన్యూ మాల్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ సుమతి మోహన్ వెల్లడించారు.

'శ్రీరంగం'లో కైశిక ఏకాదశి ఉత్సవాలు ప్రారంభం

ప్యారీస్, డిసెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): భూలోక వైకుంఠంగా విరాజిల్లుతున్న 'శ్రీరంగం రంగనాథస్వామి ఆలయం'లో కైశిక ఏకాదశి ఉత్సవాలు బుధవారం ప్రత్యేక పూజలతో ప్రారంభమైయ్యాయి. వచ్చే శుక్రవారం తెల్లవారు జామున 2గంటల వరకు నంబెరుమాళ్‌ను కీర్తిస్తూ వేదపండితులు కౌశిక పారాయణం చేయనున్నారు. తిరుచ్చి జిల్లా శ్రీరంగం రంగనాథస్వామి ఆలయంలో కార్తిక మాసంలో వచ్చే కైశిక ఏకాదశి ఉత్సవాలను కోలాహలంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది ఉత్సవాలు బుధవారం ఉదయం 6 గంటలకు వేలాదిమంది భక్తుల సమక్షంలో ప్రారంభమయ్యాయి. ఉత్సవ మూర్తి నంబెరుమాళ్‌ను ఆభరణాలు, పూలతో అలంకరించి మూల స్థానంనుంచి ప్రధాన మండపానికి తరలించారు. ఈ సందర్భంగా స్వామి వారికి 365 వస్త్రాలు, 365 తాంబూలాలు, 365 కర్పూర హారతులిచ్చి పూజలు నిర్వహించారు. కైశిక ఏకాదశి ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీరంగంలో భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ రవాణా సంస్థలు పలు జిల్లాల నుంచి శ్రీరంగానికి శుక్రవారం వరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నాయి. రద్దీలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరుగకుండా జిల్లా పోలీసు శాఖ పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసింది.

పెరంబూరు - విల్లివాక్కం మధ్య నాలుగో రైల్వే టెర్మినల్

● రైల్వే మంత్రిని కోరిన ఎంపీ గిరిరాజన్



రైల్వేశాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న డీఎంకే ఎంపీ గిరిరాజన్

టి.నగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పెరంబూరు - విల్లివాక్కం రైల్వేస్టేషన్ల నడుమ నాలుగో రైల్వే టెర్మినల్ ఏర్పాటు చేయాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు డీఎంకే పార్లమెంట్ సభ్యుడు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు ఢిల్లీలో మంత్రిని కలిసి ఓ వినతిపత్రం సమర్పించారు. రాజధాని నగరంలో పెరుగుతున్న జనాభా కారణంగా రైల్వే రవాణా సదుపాయాలు అన్ని వర్గాల ప్రజలకు నిత్యావసరంగా మారిందని, దేశం నలుమూలల నుండి ప్రతిరోజూ వేల సంఖ్యలో వైద్యసేవలు, వ్యాపారం, విద్య, వాణిజ్యం, ఆలయాలు, పర్యాటక ప్రాంతాల సందర్శన కోసం వస్తున్నారని, దీనితో ఎక్కువ మార్గాల్లో దేశంలోని పలు ప్రాంతాలకు రైళ్లను నడపాల్సిన అవసరం ఏర్పడిందని గిరిరాజన్ పేర్కొన్నారు. ప్రస్తుతం చెన్నైలో సెంట్రల్, ఎగ్మూరు రైల్వే టెర్మినల్స్ పెరిగిన జనాభా అవసరాలకు చాలడం లేదని, తాంబరం రైల్వేస్టేషన్‌ను మూడో రైల్వే టెర్మినల్‌గా ఉపయోగించుకుంటున్నా ఆ ప్రాంతం నగర శివారులో ఉందని తెలిపారు. ఈ పరిస్థితులలో నాలుగో రైల్వే టెర్మినల్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, చెన్నై నగరం, సబర్బన్ ప్రాంతాల్లోని లక్షలాది మందికి రైలు ప్రయాణం సులభసాధ్యం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ అంశాలన్నింటిని పరిగణనలోకి తీసుకుని పెరంబూరు - విల్లివాక్కం స్టేషన్ల నడుమ ఖాళీగా ఉన్న రైల్వేశాఖకు చెందిన స్థలంలో నాలుగో రైల్వే టెర్మినల్ ఏర్పాటు చేయాలని, దానికోసం 2025 సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు విజ్ఞప్తి చేశారు.



ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే తాయగం కవి ఆధ్వర్యంలో పులియాంతోపులో ఉన్న ప్రైవేటు పాఠశాలలో బుధవారం నిర్వహించిన కర్రసాము పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న మంత్రులు అన్బిల్ మహేష్, పీకే శేఖర్‌బాబు తదితరులు..



చెన్నై సైదాపేటలో ఉన్న కళాశాల విద్య డైరెక్టరేట్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో 'ముఖ్యమంత్రి పరిశోధన ప్రోత్సాహక నిధి' పథకంలో 25 విద్యార్థులకు తలా రూ.25,000 విలువ చెక్‌లు అందజేస్తున్న ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవీ చెళియన్

శ్రీరంగనాథుడికి వజ్రాల కిరీటం

● అందజేసిన భరతనాట్యకళాకారుడు జాకీర్‌హుసేన్

చెన్నై, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీరంగంలోని శ్రీరంగనాథ స్వామివారికి ప్రముఖ భరతనాట్య కళాకారుడు జాకీర్ హుసేన్ కోట్లాది రూపాయల విలువచేసే వజ్రాల కిరీటాన్ని కానుకగా సమర్పించారు. బుధవారం ఉదయం శ్రీరంగం ఆలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆ కిరీటాన్ని ఆలయ డిప్యూటీ కమిషనర్ మారియప్పన్, ప్రధానార్చకులు సుందరభట్టార్‌కు అందజేశారు. ఆ తర్వాత జాకీర్ హుసేన్ మీడియాతో మాట్లాడుతూ 3,160 కారెట్ల మాణిక్యం, 600 వజ్రాలు, మరకతం పొదిగిన వజ్రకిరీటాన్ని శ్రీరంగనాథస్వామికి కానుకగా ఇవ్వడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. జన్మతా ముస్లిం అయినప్పటికీ శ్రీరంగనాథుడంటే తనకెంతో ఇష్టమని, అందువల్లే మాణిక్యాలు పొదిగిన కిరీటాన్ని స్వామివారికి కానుకగా సమర్పించడంతో తన జన్మసార్థకమైందని పేర్కొన్నారు.



వజ్రాల కిరీటాన్ని ఆలయ డిప్యూటీ కమిషనర్ మారియప్పన్‌కు అందజేస్తున్న జాకీర్ హుసేన్

అక్కదేవతలారా దీవించండి!



తిరుమల మొదటి ఘాట్‌లో అవ్వాచారి కోన వద్ద అక్కదేవతల ఆలయం ఉంది. దాదాపు 80 ఏళ్ల చరిత్ర ఈ ఆలయానికి ఉంది. 1940లలో తిరుమలకు తొలి కనుమదారి నిర్మాణం జరుగుతున్నపుడు ఇక్కడ అక్కదేవతల శిలలు కనిపించాయి. వాటిని తొలగించి నిర్మాణం కొనసాగించారు. అయితే అనేక అవరోధాలు ఎదురవుతూ నిర్మాణం క్లిష్టంగా మారిందని, ఆ సమయంలో అక్కదేవతల ప్రాముఖ్యం గురించి స్థానికులు అధికారులకు వివరించారని అంటారు. దాంతో వారు వెంటనే సప్తమాతృకలను రోడ్డుపక్కనే ఉన్న పెద్ద బండరాతికింద ప్రతిష్ఠంచారని చెబుతారు. అప్పటి నుంచీ అక్కదేవతలకు పూజలు జరుగుతున్నాయంటారు. తిరుమల ఘాట్‌లో క్షేమంగా ప్రయాణాలు జరగాలని కోరుకుంటూ టీటీడీ రవాణా విభాగం 2008 నుంచీ అక్కదేవతలకు కార్తీక మాసంలో ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా కొనసాగిస్తోంది. శుక్రవారం ఉదయం ఇక్కడ టీటీడీ డ్రైవర్లు, స్థానికులు కలిసి ఘనంగా పూజలు నిర్వహించనున్నారు.

\- తిరుమల, ఆంధ్రజ్యోతి



శ్రీవారి సేవలో నటి వాసుకి

తిరుమల శ్రీవారిని బుధవారం సినీనటి, ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్‌సాయి సతీమణి వాసుకి దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆమె దర్శనం చేసుకున్నారు.

\- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఎలక్ట్రిక్ చోటా లగేజీ స్కూటర్



ఇది ఆటో కాదు.. ట్రాలీ కాదు.. బ్యాటరీతో నడిచే లగేజీ వాహనం. తిరుపతి నగరంలో సందుగొందుల్లో శబ్దం లేకుండా దూసుకుపోతూ సందడి చేస్తోంది. వివిధ ప్రాంతాల్లోని ప్రభుత్వ బడులకు మధ్యాహ్నభోజనం తీసుకువెళ్లేందుకు ఇస్కాన్ సంస్థ ఈ వాహనం వినియోగిస్తోంది. చిన్న సందుల్లో వెళ్లడం ట్రాలీలకు కష్టంగా మారడంతో తమకు ఉపయోగపడేలా ఎలక్ట్రిక్ లగేజీ స్కూటర్‌ను మలచుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లో మినీ బ్యాటరీ ఆటోల గురించి తెలుసుకుని అనంతపురంలో ఒక లగేజీ స్కూటర్‌ను కొని ఇలా ట్రక్కులా మార్చుకున్నారు. ఇందుకోసం రూ.2 లక్షలు ఖర్చయింది. ఎండా,వానా ఏదొచ్చినా ఆహారపదార్థాలకు ఇబ్బంది లేకుండా బడులకు ఈ వాహనం చేరవేస్తోంది.

\-తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి



హుండీ ఆదాయం రూ.4.27 కోట్లు


తిరుమల, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8గంటల సమయం పడుతోంది.బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో16 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచివున్నారు.

హుండీ(సోమవారం నాటిది) ద్వారా: రూ.4.27 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 67,284

తలనీలాలు సమర్పించినవారు: 19,064

శ్రీకాళహస్తిలో ఏడు గంగల వేడుక



శ్రీకాళహస్తి,డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి):శ్రీకాళహస్తిలో బుధవారం ఏడుగంగమ్మల జాతర వైభవంగా జరిగింది. గంగమ్మలను దర్శించుకునేందుకు భక్తజనం పోటెత్తడంతో వీధులు కిక్కిరిసిపోయాయి. శ్రీకాళహస్తి పట్టణంలో యేటా డిసెంబరులో ఏడుగంగమ్మల జాతర నిర్వహించడం ఆనవాయితీ. మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అమ్మవార్లకు సారె సమర్పించారు. ఏడు ప్రాంతాల్లోని ఏడుగంగమ్మలను విశేషంగా అలంకరించి ఊరేగింపుగా బుధవారం వేకువజామున 3 గంటల సమయంలో శ్రీకాళహస్తి న్యాయస్థాన భవనం సమీపంలోని ఏడుగంగమ్మల ఆలయం వద్దకు చేర్చారు. కుంభం, ప్రత్యేక పూజలు అనంతరం అమ్మవార్ల ముసుగు తొలగించి భక్తులకు దర్శనం కల్పించారు. అక్కడి నుంచి ఏడుగురు అమ్మవార్లనూ ఒకరి వెనుక వరుసగా ఊరేగించారు. తప్పెట్లు, తాళాలు, మంగళవాయిద్యాలు, బ్యాండు మేళాలు మధ్య భక్తులు తన్మయత్వంతో చిందులేశారు. బుధవారం రాత్రి ఏడుగంగమ్మలూ ముత్యాలమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. పూజల అనంతరం నిమజ్జనం నిర్వహించారు.

డిగ్రీ పరీక్షల్లో పది మంది డీబార్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ 3, 5 వ సెమిస్టర్ పరీక్షల్లో బుధవారం మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న పది మంది విద్యార్థులను డీబార్ చేశారు. తిరుపతిలో ముగ్గురు, చిత్తూరులో ఏడుగురిని డీబార్ చేసినట్టు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

రేపు తిరుత్తణి ఆలయంలో మహాదీపం

పెరంబూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవాల్లో భాగంగా ఈ నెల 13న మహాదీపం వెలిగించనున్నారు. సాయంత్రం 6 గంటలకు వళ్లి, దేవసేన సమేత మురుగ పెరుమాళ్ ప్రత్యేక అలంకరణలో నెమలి వాహనంలో విహరించనున్నారు. అదే సమయంలో, ఆల యం ఎదురుగా ఉన్న పచ్చరసి కొండపై పెద్ద దీపంలో మహాదీపం వెలిగించనున్నారు. మహాదీపం వెలిగించిన వెంటనే తిరుత్తణి నగర ప్రజలు తమ ఇళ్లు, దుకాణాల వద్ద నెయ్యి దీపాలు వెలిగించి పూజలు చేయనున్నారు.

భూవివాదం కోర్టులో వున్నా దౌర్జన్యంగా కంచె తొలగించారు!

● పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

తిరుపతి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు సర్వే నెంబరు 478లో నా భూమి విషయమై తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి కుటుంబీకులతో వివాదం హైకోర్టులో పెండింగులో ఉండగానే.. దౌర్జన్యంగా కొందరు కంచెను తొలగించారంటూ బాధితుడు చెరుకూరు వెంకటేశ్వర ప్రసాద్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు తండ్రి ద్వారా సంక్రమించిన ఆ భూమిని ఇచ్చేయాలంటూ కొంతకాలం కిందట అప్పటి తిరుపతి ఎమ్మెల్యే కరుణాకర్‌రెడ్డి, ఆయన సతీమణి రేవతీరెడ్డిల ప్రోద్బలంతో కొందరు తమపై పలుమార్లు బెదిరింపులకు పాల్పడ్డారని అందులో పేర్కొన్నారు. తన భూమిలోని 64 టేకు చెట్లు, 40 మామిడి చెట్లను కూడా నరికివేశారని, దానికి సంబంధించిన వీడియో క్లిప్పులను కూడా ఫిర్యాదు వెంట జతచేశారు. దీనిపై తాను హైకోర్టును ఆశ్రయించగా కేసు పెండింగులో ఉందని పేర్కొన్నారు. తాజాగా బుధవారం కొందరు వ్యక్తులు తన భూమిలోకి ప్రవేశించి ఎక్స్‌కవేటరుతో దౌర్జన్యంగా కంచెను తొలగించారని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వీడియో క్లిప్పులను కూడా ఫిర్యాదుతో పాటు పంపించారు. గతంలో లాగానే మళ్లీ బెదిరింపులకు పాల్పడుతున్నందున తమకు ప్రాణ హాని ఉందని ఆందోళన వ్యక్తం చేసిన బాధితుడు.. దీనిపై ప్రభుత్వం జోక్యం చేసుకుని నిందితులను శిక్షించాలని కోరారు. ఈ వ్యవహారంలో ప్రమేయమున్న అందరిపై కేసు నమోదు చేయాలని, తనకు రక్షణ కల్పించాలని పోలీసు అధికారులను బాధితుడు కోరారు. కాగా, బాధితుడు చెరుకూరు వెంకటేశ్వర ప్రసాద్ కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ సంప్రదింపుల కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. అలాగే ఎఫ్‌సీఐకి సంబంధించి ఏపీకి ఎస్ఎల్‌సీసీ కమిటీ సభ్యుడుగానూ వ్యవహరిస్తున్నారు.

ఆహార కొరతను అధిగమించేలా పరిశోధనలు జరగాలి

● జాతీయ సదస్సులో పశువైద్య విద్యార్థులకు పిలుపు

తిరుపతిరూరల్, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఆహార కొరతను అధిగమించేందుకు సరికొత్త పరిశోధనలు ఆవిష్కరించాలని చెన్నైకి చెందిన ప్రకాశ్ ఫుడ్‌మీల్స్ సంస్థ అధినేత డాక్టర్ ప్రకాశ్‌రావు సూచించారు. తద్వారా భావితరాలకు ఆహార భద్రత కల్పించాలన్నారు. 'పశువుల ఆరోగ్యం, ఉత్పత్తి' అంశాలపై దేశంలోనే తొలిసారిగా పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు ఎస్వీవెటర్నరీ కళాశాల వేదికగా చేపట్టిన రెండు రోజుల జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. పశువైద్య విద్య విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి తమతోపాటు ఇతరులకు కూడా ఉపాధి కల్పించాలన్నారు. పారిశ్రామికవేత్తగా తన ఎదుగుదలను వివరించి విద్యార్థుల్లో స్ఫూర్తినింపారు. దేశీయ ఆవుల, గేదె జాతుల జన్యుసమర్థతను ఉపయోగించుకుని భవిష్యత్‌తరాలకు మేలైన దేశీయ పశుజాతి రకాలు అందించాలని పాండిచ్చేరి వెటర్నరీ కళాశాల డీన్ డాక్టర్ షెజియన్ ఆకాంక్షించారు. తొలిసారిగా పీజీ, పీహెచ్‌డీ విద్యార్థుల పరిశోధనాంశాలకు సంబంధించి జాతీయస్థాయి సదస్సు నిర్వహించడం అభినందనీయమని కేంద్ర పశుసంవర్ధకశాఖ మాజీ కమిషనర్ డాక్టర్ సురేష్ హోన్నప్పగల్ కొనియాడారు. వివిధ సెషన్స్‌లో దాదాపు 130 పరిశోధనాంశాలను ప్రజంటేషన్ చేయనున్నారని, వీటిలో ఉత్తమ పరిశోధనాపత్రాలను ఎంపిక చేసి అవార్డులు ప్రదానం చేస్తామని సదస్సు కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ పి.జగపతి రామయ్య వివరించారు. ఈ సందర్భంగా సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు. పలువురు పరిశోధకులు తమ పరిశోధనాంశాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రవికుమార్, డీన్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య, డాక్టర్ కె.సుధీర్, డాక్టర్ మురళి, డాక్టర్ చైతన్య, డాక్టర్ రాజా తదితరులు పాల్గొన్నారు.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రకాశ్‌రావు, షెజియన్ తదితరులు

హైకోర్టు ప్రాంగణంలో చేతులు మారిన బాంబు

● ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో సంచలన విషయాలు



పెరంబూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆమ్‌స్ట్రాంగ్ హత్యకు వినియోగించిన బాంబు హైకోర్టు ప్రాంగణంలో చేతులు మారిందని పోలీసులు షాకింగ్ సమాచారం అందించారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ జూలై 5వ తేది పెరంబూర్‌లో దారుణంగా హత్యకు గురయ్యారు. ఈ హత్యను విచారించిన పోలీసులు 28 మందిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో ప్రమేయమున్న రౌడీ తిరువేంగడం, సీసింగ్ రాజా ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. ఈ కేసులో సెంబియం పోలీసులు, 28 మందిపై 4,832 పేజీలతో కూడిన ఛార్జిషీటును ఎగ్మూర్ కోర్టుకు అందజేశారు. ఈ కేసుతో సంబంధాలున్న అందరినీ గూండా చట్టం కింద అరెస్ట్ చేశారు. తమను గూండా చట్టం కింద అరెస్ట్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ ముద్దాయిలు మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ బుధవారం విచారణకు రాగా, ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసుకు సంబంధించి పోలీసు శాఖ షాకింగ్ సమాచారం తెలియజేసింది. ఆమ్‌స్ట్రాంగ్ హత్యకు వినియోగించిన బాంబు హైకోర్టు ప్రాంగణంలో చేతులు మారిందని పోలీసు శాఖ తెలియజేసింది. అనంతరం న్యాయమూర్తులు, హైకోర్టు ప్రాంగణంలో బాంబు ఎలా వచ్చింది? అంటూ ప్రశ్నించి, ఈ వ్యవహారంపై ప్రత్యేకంగా విచారించాలని ఉత్తర్వులు జారీచేసింది. అలాగే, ఈ కేసుకు సంబంధించిన అన్ని పిటిషన్ల విచారణ జనవరి మొదటి వారానికి వాయిదావేశారు.

500 లో ఫ్లోర్ ఎలక్ట్రిక్ బస్సులు

● జర్మన్ నిధులతో కొనుగోలు ● సర్కారు వెల్లడి

అడయార్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కర్బన ఉద్గరాలను తగ్గించి, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో లోఫ్లోర్ ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసేందుకు శ్రీకారం చుట్టింది. తొలిదశలో జర్మన్ నిధులతో 500 లోఫ్లోర్ ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేయనుంది. 2024-25 వార్షిక బడ్జెట్‌లో ఈ తరహా బస్సులను కొనుగోలు చేయనున్నట్టు ప్రకటించింది. ఆ ప్రకారంగానే లోఫ్లోర్ ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించింది. చెన్నై, కోవై, మదురై నగరాల్లో నడిపేందుకు , ఏసీ, నాన్ ఏసీ తరహా బస్సులను కొనుగోలు చేయాలని భావిస్తుంది. ప్రభుత్వం ఆహ్వానించిన టెండర్లలో ఎలక్ట్రిక్ బస్సుల చార్జింగ్, డిపోల నిర్వహణ వంటి అంశాలను కూడా పొందుపరిచారు. అందువల్ల ఈ తరహా బస్సులను సరఫరా చేసేందుకు ముందుకు వచ్చే సంస్థ.. ఆ బస్సుల నిర్వహణ, చార్జింగ్ వంటి సదుపాయాలను కల్పించాల్సి ఉంటుంది. ఈ టెండర్లలో పాల్గొనదలచిన కంపెనీ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. కాగా, చెన్నై నగరంలో ఇప్పటికే డీజిల్‌తో నడిచే లోఫ్లోర్ సిటీ బస్సులను మెట్రోపాలిటన్ రవాణా సంస్థ (ఎంటీసీ) నడుపుతున్న విషయం తెల్సిందే. ఇపుడు డీజిల్ ఖర్చు తగ్గించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేయాలని నిర్ణయించి, టెండర్లను ఆహ్వానిస్తుంది.

ఎస్ఆర్ఎం వర్సిటీలో సైన్స్ అకాడమీ సమావేశం



ఇస్రో చైర్మన్ సోమనాథ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎస్ఆర్ఎం వర్సిటీ ప్రొ ఛాన్సలర్ పి.సత్యనారాయణ

చెన్నై, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాట్టాన్‌కుళత్తూరులోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో బుధవారం భారత జాతీయ వైజ్ఞానిక సంస్థ (ఐఎన్ఎస్ఏ) 90 వ వార్షిక సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం ప్రొ ఛాన్సలర్ డాక్టర్ పి. సత్యనారాయణ ప్రారంభించారు. ఐఎన్ఎస్ఏ అధ్యక్షులు ప్రొఫెసర్ అశుతోష్ శర్మ మాట్లాడుతూ దేశంలో శాస్త్ర సాంకేతిక రంగాలలో విప్లవాత్మకమైన మార్పులు జరుగుతున్నాయని, ఆ దిశగా పరిశోధనలు సాగించాల్సిన అవసరందని శాస్త్రవేత్తలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో హోమీబాబా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఛాన్సలర్ డాక్టర్ అనిల్ కాకోడ్కర్, నీతిఆయోగ్ సభ్యుడు డా. వీకే సరస్వత్, ఇస్రో చైర్మన్ సోమనాథ్ సహా 200 మంది దాకా ప్రతినిధులు పాల్గొన్నారు.

బైక్‌పై సాహసాలు: విద్యార్థులకు జరిమానా



వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రమాదకరంగా బైక్ సాహసాలు చేసిన విద్యార్థులకు పోలీసులు జరిమానా విధించారు. కన్నియాకుమారి జిల్లా కుళచ్చల్ ప్రాంతంలో రెండు బైక్‌ల్లో విద్యార్థులు సాహసాలకు పాల్పడ్డారు. ఆ సాహసాలను చూసి వాహనచోదకులు, పాదచారులు భయభ్రాంతులయ్యారు. ఈ క్రమంలో, ఆ మార్గంలో గస్తీ తిరుగుతున్న పోలీసులు విద్యార్థులను అడ్డుకున్నారు. రెండు బైక్‌లను స్వాధీనం చేసుకుని, విద్యార్థులపై 5 సెక్షన్ల కింద కేసు నమోదుచేసి రూ.25,000 జరిమానా విధించారు.

రంగనాథుడికి టీటీడీ పట్టు వస్త్రాల సమర్పణ



తిరుమల, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం శ్రీరంగంలోని రంగనాథ స్వామికి బుధవారం టీటీడీ తరపున బుధవారం ఈవో శ్యామలరావు పట్టువస్త్రాలు సమర్పించారు. దేశవ్యాప్తంగా ఉన్న ముఖ్యమైన పుణ్యక్షేత్రాలకు టీటీడీ 2008 నుంచి పట్టువస్త్రాలను సమర్పిస్తోంది. అందులోభాగంగా ఈఏడాది కూడా శ్రీరంగం ఆలయానికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ప్రధాన ద్వారం వద్దకు చేరుకున్న టీటీడీ ఈవోకు శ్రీరంగం ఆలయ జాయింట్ కమిషనర్ మరియప్పన్ స్వాగతం పలికారు. అనంతరం ఈవో.. పీఠాధిపతికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రధాన ఆలయ సముదాయంలో ఉన్న మూలవిరాట్ ఇతర ఉప ఆలయాలను దర్శించుకున్నారు. సాధారణంగా శ్రీరంగం ఆలయ అధికారులు ఏటా ఆణి వారి ఆస్థానం రోజున తిరుమల ఆలయానికి వస్త్రాలను సమర్పిస్తారు. ఈ పవిత్ర కార్తీక మాసం ఏకాదశి రోజున శ్రీరంగం ఆలయానికి టీటీడీ పట్టువస్త్రాలను అందజేస్తుంది. ఈ కార్యక్రమంలో టీటీడీ ఆలయ డిప్యూటీఈవో లోకనాథం, ఇతర టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

కేవీఐసీ ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్య శిక్షణ



శిక్షణలో పాల్గొన్న యువకులతో నిర్వాహకులు

తిరుత్తణి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక పల్లిపట్టులో ఖాదర్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కేవీఐపీ) ద్వారా 20 మంది యువకులకు వృత్తి శిక్షణ అందించారు. సాయి మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండరీ స్కూలులో కేవీఐపీ అసిస్టెంట్ డైరెక్టర్-2 సయ్యద్ కలీముల్లా సమక్షంలో శిక్షణా కార్యక్రమం జరిగింది. బుధవారం జరిగిన కార్యక్రమానికి స్కూలు ప్రిన్సిపాల్ ఎం.గురుమూర్తి అధ్యక్షత వహించి పలు విషయాలు వివరించారు. కార్యక్రమంలో మిస్టర్ కన్నన్ కేశవ, సెల్వం, సతీష్, తదితరులు పాల్గొన్నారు.